# సక్కుబాయి

కష్టాల్లో ఉన్న భక్తులు అయ్యో! దేవుడు మా మొర వినటం లేదే...అనుకుంటారు. అంతటి భక్తులకు ఇన్ని కష్టాలా! అనుకుంటారు చూచేవాళ్లు. అలా భావించటానికి కారణం ఏమిటంటే, పూర్వజన్మలో చేసిన దుష్కార్యాల సంగతి వారికి తెలియకపోవటమే! సక్కూబాయి కథ మీకందరికీ తెలిసినదేకదా! దైవభక్తురాలు, సాధుశీల అయిన సక్కూబాయి బ్రహ్మరాక్షసి వంటి అత్తగారి చేతిలో నానా బాధలూ పడింది.

**పూర్వజన్మ**

సక్కుబాయి వెనుకటి జన్మలలో ఒక వేశ్య. ఆమెవల్ల అనేక సంసారాలు పాడైపోయాయి. ఆ ఊరిలోని స్త్రీలు దుఃఖిస్తూ, కంటికి కడివెడు నీళ్ళు కారుస్తూ శ్రీకృష్ణునికి మొరపెట్టుకున్నారు. భగవంతుడైన కృష్ణుని మనస్సు కరిగింది. ఒక రాజకుమారుని వేషంలో ఆ వేశ్య యింటికి వెళ్ళాడు. దివ్య తేజస్సుతో ప్రకాశించే ఆ రాకుమారుని చూసి ఆమె సమీపించింది. కాని, అతనిని ముట్టేందుకు ధైర్యం చాలలేదు. 'ఇకమీదట నీవు ఈవిధమైన మలిన జీవితాన్ని గడుపవద్దు. ఈనాటినుండి నీ శేష జీవితాన్నంతా భగవంతుని ధ్యానభజనలతో గడుపు' అని ఆదేశించాడు ఆ రాకుమారుని రూపంలోనున్న శ్రీకృష్ణుడు. ఆ మాటల ప్రభావం ఆమె మనస్సుపై సూటిగా పడింది. తన తప్పు తెల్సుకొని పశ్చాత్తాపపడింది. ఆమెకు వైరాగ్యం ఉదయించింది. అప్పటినుండి ఆమె భగవదారాధనలో మునిగిపోయింది. అదంతా బూటకమని, మోసగించేందుకు అలా వేషం వేస్తున్నదని జనులు ఆమెను ఎగతాళి చేయసాగారు. అయితే ఆమె మాత్రం దేనినీ లక్ష్యపెట్టలేదు. దృఢమనస్కురాలై శ్రీకృష్ణారాధనలోనే తన శేషజీవితాన్ని గడిపింది. గత జన్మలో ఆమె చేసిన పాపాల వలన, పచ్చని సంసారాలను కూల్చి సాటి స్త్రీలను యేడ్పించినందువలన ఆ జన్మలో రాక్షసిలాంటి అత్త పెట్టే బాధలన్నీ పడుతూ బ్రతకవలసి వచ్చింది. అయితే శ్రీకృష్ణుడు చెప్పిన ప్రకారంగా మలిన జీవితానికి స్వస్తిచెప్పి, మంచి నడవడికను అలవరచుకొనటం చేత శ్రీకృష్ణుని అనుగ్రహం ఆమెపైన ప్రసరించింది. సక్కూబాయిని అత్తగారు అనేక కష్టాలకు గురిచేసింది. కాని, క్షమాగుణమే సక్కుబాయికి శాంతిని, ఓర్పును కలుగచేసింది. రాత్రింబవళ్లు ఆమె పాండురంగనినే స్మరిస్తూ వచ్చింది.

భగవంతుడు నీవు పుట్టక పూర్వమే ఉన్నాడు. నీ తదనంతరం కూడా ఉంటాడు. కనుకనే భగవంతుని కాలాతీతుడు, అనంతుడు అన్నారు. ఇట్టి సత్యాన్ని గుర్తించిన సక్కుబాయి తన అత్తగారు తనను ఎన్ని కష్టాలకు గురిచేసినప్పటికి పాండురంగని చింతన మానలేదు. కట్టకడపటికి కృష్ణుడు తానే సక్కుబాయి వేషాన్ని ధరించి ఆమెయొక్క అత్తగారింట్లో పనులు చేస్తూ సక్కుబాయిని పండరీపురం పంపించాడు. చూశారా! భగవంతుని ప్రేమతత్త్వం ఎంత ఘనమైనదో! భక్తునికి ఎట్టి అపకీర్తి రాకుండా చూసుకుంటాడు భగవంతుడు. సక్కుబాయి సంసారాన్ని వదలిపెట్టి పండరీపురం వెళ్ళిందే అని పదిమందీ అనవచ్చు. కనుక, తానే సక్కుబాయి వేషాన్ని ధరించి అత్తగారింట్లో పనిచేశాడు. సక్కుబాయి పండరీపురం వెళ్ళింది.

**అత్తింటి ఆరళ్లు**

'నిలువనీడలేని బ్రతుకు నీకొరకని మోయుదాన రంగా!
నిలువదురా నా మనసు నీ చూపులు దూరమైన
కలలోనైన కనులకు కానగరావా కృష్ణా!
నిన్ను విడచి నిలువలేనురా, కానగరాదా!'

అని పాడేది. ఒకనాడు ఆమె అత్తగారు బస్తాడు జొన్నలు తిరగలిలో విసరమని శాసించింది. తిరగలి త్రిప్పి త్రిప్పి సక్కూబాయి చాలా అలసిపోయింది.

'ఎంతకాలమీ బాధల్ రంగా!
ఎందుకోసమీ గాథల్?
న్యాయము లేదా? నాతో వాదా?
నాపై కరుణయు రాదా?
నీ దాసిని నే నౌనా? కాదా?
నీచపరచ మర్యాదా?'

'నిజముగా నేను నీ దాసినైతే నా కెందుకీ బాధలు. నాలో ఏదో దోషముంది. కనుకనే, నీవింత ఆలస్యము చేస్తున్నావు. నా దోషమేదో తెల్పి నన్ను కాపాడు' అని ప్రార్థించింది.

**భక్తవత్సలుని లీలలు**

భక్తవత్సలుడైన కృష్ణపరమాత్మ అదృశ్యంగా ఆమె యింట, వెంట, జంట, కంట ఉండి ఆమె అనుభవిస్తున్న ప్రారబ్ధకర్మ యొక్క తీవ్రతను తగ్గిస్తూ ఉండేవాడు. ఆమెతో కలసి తానుకూడా రాశులకొద్దీ పోసిన జొన్నలన్నీ విసిరాడు! ఆమె రూపంలో తాను అత్త నిర్బంధంలో ఉండి, ఆమెకు దైవదర్శన భాగ్యాన్ని కలిగించాడు! నిజమైన భక్తుడు తన సర్వస్వమును భగవంతునికే అర్పిస్తాడు. భగవంతుడు భక్తపరాధీనుడు. భక్తునికి మరొక పనే లేదు. నిరంతరము దైవచింతనే. భగవంతునకు కూడా నిరంతరమూ భక్తుని చింతనే.

ఏదైనా మార్గంలో వెళ్ళేటప్పుడు దేవాలయం కనిపించిందంటే ఏదో మొక్కుబడిగా రెండు చేతులెత్తి నమస్కారం చేస్తారు. మీరు నమస్కారం చేయకపోతే భగవంతునికేమీ తక్కువ కాదు. కానీ, మీరు నిజంగా నమస్కరించాలంటే అక్కడ నిలబడి శాంతంగా స్మరించి హృదయపూర్వకంగా నమస్కారం చేసుకోవాలి. ఈనాటి సాధనలన్నీ నిర్బంధ సాధనలుగా, కృత్రిమమైన సాధనలుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి సాధనలవల్ల ప్రయోజనం లేదు. కొంతమంది యిరవైనాలుగు గంటలూ రాంరాం అంటూ జపమాల త్రిప్పుతుంటారు. ఇది కృత్రిమంగా జరిగిపోతున్నాది. జపమాల చేతిలో లేకపోయినా, తాను నిద్రపోతున్నా ఆ వ్రేళ్ళు తిరుగుతూనే ఉంటాయి. ఇది ప్రాక్టీసు వల్ల జరిగే పనేగాని హృదయపూర్వకంగా చేసేది కాదు. హృదయపూర్వకంగా ఒక్కతూరి 'రంగా' అని పిలచిన చాలు. సక్కుబాయి జగత్తుకు నిరూపించిన ఆదర్శమిదే!

ఒకానొక సమయంలో సక్కుబాయి నామదేవుని వద్దకుపోయి, 'స్వామీ! నేను చేసిన పిడకలను ఎదురింటి వారు దొంగిలిస్తున్నారు' అని ఫిర్యాదు చేసింది. అప్పుడు నామదేవుడు, ' సక్కుబాయీ! అవి నీ పిడకలేనని ఎట్లా చెప్పగలవు?' అని ప్రశ్నించాడు. 'నేను నిరంతరమూ నామమును స్మరిస్తూ సర్వకర్మలనాచరిస్తుంటాను. నేను స్మరించే నామ ప్రభావం ఆ పిడకలపైకూడా ఉంటుంది' అని పలికి, పరుగెత్తి ఇంటికి పోయి ఒక పిడకను తెచ్చి నామదేవుని చెవిదగ్గర పెట్టింది. 'రంగా రంగా పాండురంగా! రంగా రంగా పాండురంగా!' అని వినిపించింది నామదేవునికి. అతడు తన చెవులను తానే నమ్మలేక మరొక పిడకను చేయమని కోరాడు. ఆమె ఆవు పేడను తెచ్చి నామాన్ని స్మరిస్తూ మరల పిడకను తయారు చేసింది. ఆ సక్కుబాయి పిడకలు చేసేటప్పుడు కూడా నామాన్ని స్మరించటం చేత పిడకలయందు కూడా నామం ప్రవేశించింది. దీని వల్లనే నామదేవుడు సక్కుబాయికి శిష్యుడుగా మారిపోయి తానుకూడా నిరంతరము నామస్మరణ చేస్తూ వచ్చాడు. స్మరణే తరుణోపాయమనే సత్యాన్ని బోధిస్తూ వచ్చాడు.

గత జన్మలో శ్రీకృష్ణుని స్మరిస్తూ, భజిస్తూ ఉన్నందువల్ల ఆమెకు ఈ జన్మలో కూడా అది సహజంగా కొనసాగింది. ఆమె స్మరించినప్పుడల్లా పాండురంగడు ఆమెకు ప్రత్యక్షమయ్యేవాడు. తననే పరమ గతిగా నమ్ముకొని భజించే సక్కూబాయిని చివరకు పాండురంగడు తనలోనే ఐక్యం చేసుకున్నాడు!